Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANIVARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 3 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 26 - 6 - 2025

94406 62699 rajadhanivartalu X rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## కేంద్ర కేబినెట్‌లో చంద్రబాబు, లోకేష్‌ను మెచ్చుకున్న ప్రధాని




**న్యూఢిల్లీ :** ఏపీలో కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్రపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల జల్లు కురిపించారు. ఈరోజు (బుధవారం) జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో యోగాంధ్ర ప్రస్తావనకు వచ్చింది. యోగాంధ్ర విజయవంతంమైందని కేబినెట్‌లో ప్రధాని ప్రశంసించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ యోగాంధ్రను విజయవంతం చేశారని తెలిపారు. యోగాంధ్రను విజయవంతం చేసినందుకు చంద్రబాబు, లోకేష్‌లను కేబినెట్ మంత్రుల ముందు మెచ్చుకున్నారు ప్రధాని. యోగాంధ్ర కార్యక్రమం ఊహించని విధంగా జరిగిందన్నారు. ఇప్పటి వరకూ తాను ఎన్నో కార్యక్రమాలను చూశానని... కానీ యోగాంధ్రలాంటి అతి భారీ కార్యక్రమాన్ని చూడలేదన్నారు. యోగాంధ్రను ప్రెస్టేజ్‌గా తీసుకుని చంద్రబాబు, లోకేష్ చేయడం నిజంగా అభినందనీయమని కొనియాడారు. ఏపీలో నెల రోజుల పాటు యోగాంధ్రను నిర్వహించడం అన్నది మర్చిపోలేని విషయమన్నారు. అసలు 30 రోజుల పాటు సమాజంలోని అన్ని వర్గాల వారిని కలిపి యోగాంధ్రను ఎలా చేశారో నివేదిక ఇవ్వాలని ఏపీని కోరినట్లు కేబినెట్ సమావేశంలో మోదీ తెలిపారు. ఏపీ నుంచి యోగాంధ్రపై నివేదిక వచ్చిన తరువాత దాన్ని అన్ని రాష్ట్రాలకు పంపనున్నట్లు చెప్పారు. ఒక మంచి కార్యక్రమాన్ని ఎలా విజయవంతం చేయాలో చంద్రబాబు, లోకేష్‌ను చూసి మిగతా వారంతా నేర్చుకోవాలని సూచించారు. యోగాంధ్ర విజయాన్ని అందరూ స్టడీ చేయాలని కేంద్ర మంత్రులకు తెలియజేశారు. యోగాంధ్రకు రెండు గిన్నీస్ రికార్డులతో పాటు పలు రికార్డులు రావడం కూడా సంతోషంగా ఉందని కేబినెట్ సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పుకొచ్చారు. కాగా.. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఎంతో విశేషంగా నిర్వహించింది ఏపీ ప్రభుత్వం. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో యోగా కార్యక్రమాన్ని మెచ్చుకున్నారు మోదీ.

ఇంత భారీ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు గాను చంద్రబాబు, లోకేష్‌ను సభా వేదికపైనే ప్రధాని ప్రశంసించారు. తాజాగా కేబినెట్ సమావేశంలోనే యోగాంధ్రను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాన్ని ఎలా విజయవంతం చేయాలో చంద్రబాబు, లోకేష్‌ను చూసి నేర్చుకోవాలని కేంద్ర మంత్రులకు ప్రధాని మోదీ చెప్పడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## రేవంత్‌రెడ్డి నీ ఛాలెంజ్‌ని స్వీకరిస్తా.. హరీష్‌రావు ప్రతి సవాల్

**సిద్దిపేట, (రాజధాని వార్తలు):** బనకచర్ల ప్రాజెక్ట్ గురించి కాంగ్రెస్ పార్టీకి మాట్లాడే నైతిక హక్కు లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. రేవంత్‌రెడ్డి 18 నెలల పాలన చూశాక కాంగ్రెస్ పార్టీ అంటే ఏంటో ప్రజలకు అర్థమైందని చెప్పారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావాలి, కావాలని ప్రజలు అంటున్నారని తెలిపారు. మళ్లీ పదేళ్ల దాకా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకుండా రేవంత్‌రెడ్డి చేశారని అన్నారు. లోకల్ బాడీ ఎన్నికలు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు మాజీ మంత్రి హరీష్ రావు. ఈ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే నిర్వహించడం లేదని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. ఇవాళ (బుధవారం) సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం యూత్ కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల ప్రశాంత్ పాటిల్ బీఆర్ఎస్‌లో చేరారు. ప్రశాంత్ పాటిల్‌కి హరీష్‌రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హరీష్‌రావు వెంట ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, బీఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. అబద్ధాల్లో సీఎం రేవంత్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పోటీపడుతున్నారని ఎద్దేవా చేశారు మాజీ మంత్రి హరీష్‌రావు. సీఎం రేవంత్‌రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ బహిరంగ చర్చకు పోదామని అంటున్నారని.. ఎక్కడికి రమ్మంటారో చెప్పాలని.. తాను సిద్ధమని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రతి సవాల్ విసిరారు. ఏ టీవీలో కూర్చుందామో, ఎక్కడ మాట్లాడుదామో చెప్పుతాను రెడీ... రేవంత్‌రెడ్డి వస్తారో, మహేష్ కుమార్ గౌడ్ వస్తారో చెప్పాలని ప్రతి సవాల్ చేశారు. అసెంబ్లీ నిర్వహించడం చేతగాక రేవంత్‌రెడ్డి పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. వారం రోజులకు మించి అసెంబ్లీ నడిపే పరిస్థితి లేదని చెప్పుకొచ్చారు. మళ్లీ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచేది కేసీఆర్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ఐదేళ్లు పూర్తిగా అధికారంలో ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలు గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు ఈ ఎన్నికల కోసం కలిసి కట్టుగా పని చేయాలని కోరారు. అందరం కలసి ఐక్యతతో ముందుకు పోతేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు సాధ్యమని హరీష్‌రావు పేర్కొన్నారు.








## ఆ సమస్య అన్ని దేశాల్లో ఉంది

## - సీఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ, (రాజధాని వార్తలు):** మొదట్లో బిజినెస్ పీపుల్‌తో రాజకీయ నాయకులు మాట్లాడే వారు కాదని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్తామంటే వెళ్లొదని.. అలా వెళ్లడం వల్ల ప్రజల్లో ఒక భావన ఏర్పడుతుందని వారు సూచించే వారని ఆయన పేర్కొన్నారు. అయినా తాను పలుమార్లు దావోస్‌కు వెళ్లానని.. పారిశ్రామిక వేత్తతో మాట్లాడి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానించానని చెప్పారు. బుధవారం విజయవాడ నగరంలో ఫిక్కీ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీఎం చంద్ర బాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. నాటి ప్రధాని పీవీ నరసింహారావు ప్రపంచీకరణకు అనుమతి ఇవ్వడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ చక్కబడిందన్నారు. గత ప్రధాని పీవీ నరసింహారావు కంపల్షన్ వల్ల అలా చేశారని చెబుతున్నప్పటికీ.. దీనివల్ల దేశానికి మేలు జరిగిందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం మనం క్వాంటమ్ కంప్యూటర్ గురించి మాట్లాడుతున్నామన్నారు. ఫిక్కీ 100 ఏళ్లకుపైగా ఉన్న సంస్థ అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్ బ్రౌన్ ఫీల్డ్ సిటీ అని.. రాజధాని అమరావతి గ్రీన్ ఫీల్డ్ సిటీ అని అభివర్ణించారు. రాజధాని అమరావతి అద్భుత నగరంగా మారబోతోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పాలనలో టెక్నాలజీని విరివిగా వినియోగిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆ క్రమంలో ప్రభుత్వ సేవలన్నీ వాట్సాప్‌లో అందిస్తున్నామని వివరించారు. మూడు దశాబ్దాలుగా టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. హైటెక్ సిటీకి మైక్రో సాఫ్ట్ సహా పలు పెద్ద కంపెనీలు వచ్చాయని గుర్తు చేశారు. ప్రస్తుతం అన్ని దేశాల్లో యువత సమస్య ఉందన్నారు. ఊహించని విధంగా టెక్నాలజీలో మార్పులు వస్తున్నాయని చెప్పారు. క్వాంటమ్ వ్యాలీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉన్న అంశాలని ఆయన సోదాహరణగా వివరిం చారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో అద్భుతాలు జరుగుతాయని సీఎం చంద్రబాబు తెలిపారు కాంపిటేటివ్ ఎకానమీలో మనం ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతోందని సీఎం చంద్రబాబు వివరించారు. అంతకుముందు ఈ సమావేశానికి హాజరైన సీఎం చంద్రబాబుకు ఫిక్కీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఫిక్కీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న చర్యలు.. అమలు చేస్తున్న పాలసీలు ఇండస్ట్రీ ఫ్రెండ్లీగా ఉంటున్నాయని ప్రశంసించారు. ఎంఎస్ఎంఈల విషయంలో చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం తీసుకుంటున్న చొరవను ఈ సందర్భంగా వారు అభినందించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047ను సాకారం చేసేందుకు తమ వైపు నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చింది.

# రేపు ఈ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గజపతినగరం విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మత్తులు చేపడుతున్న కారణంగా ఈనెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు బొబ్బిలి డివిజన్ కార్యనిర్వహక ఇంజనీర్ ఏ.అనంతరావు బుధవారం తెలిపారు. గజపతినగరం, పురిటి పెంట, హౌసింగ్ కాలనీ, ఎం.వెంకటాపురం, రైల్వే స్టేషన్ రోడ్డు, మధుపాడ, మరుపల్లి, తమ్మ రాయుడుపేట, ఎం. గుమ్మడం, పి.ఎస్.ఆర్ పురం, కె.ఎస్.ఆర్.పురం, డోలపాలెం, కాలంరాజుపేట, పిడిసిల, సీతారాంపురం, ముద్దూరు, ఎన్జీఆర్ పురం, గంగచొల్ల పెంట, పట్రువాడ, కొనిస, చిట్టేయవలస, సాలిపేట, పాత బగ్గాము, కొత్త బగ్గాము, బంగారమ్మపేట, భూదేవి పేట, మర్రివలస, దావలపేట, బూడిపేట, వాలం ఫ్యాక్టరీ, గిట్టిపల్లి, సీతారాంపురం, ఎం.వెంకటాపురం వాటర్ స్కీమ్స్‌లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు పేర్కొన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

# జగన్‌కు రాజకీయ బహిష్కరణ : భీమిలి ఎమ్మెల్యే గంటా డిమాండ్




**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** నేర పూరిత ఆలోచనలు చేసే జగన్మో హన్ రెడ్డి లాంటి వ్యక్తిని రాజకీయాల నుంచి శాశ్వతంగా బహిష్క రించే అవకాశాలను రాజ్యాంగ నిపుణులు పరిశీలించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. మానవత్వం.. జాలి..దయ.. లేని జగన్మోహన్ రెడ్డి ప్రజా జీవితంలో ఉండడానికి తగరని పేర్కొన్నారు. ఎం.వి.పి.కాలనీలోని నివాసంలో మంగళ వారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ వ్యవహారశైలిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజా సమస్యల గురించి మాట్లాడతారని జగన్ ను అసెంబ్లీకి పంపిస్తే.. ప్రతిపక్ష హోదా ఇస్తేనే హాజరవుతానన్నట్టు వ్యక్తిగత ప్రాపకం కోసం పాకులాడుతున్నారని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం నిర్దిష్ట ఎమ్మెల్యే సీట్లు గెలిస్తేనే ప్రతిపక్ష హోదా ఇవ్వడం సాధ్యపడుతుందని తెలిపారు. బెట్టింగ్ బ్యాచ్.. బ్లేడ్ బ్యాచ్.. సభ్యుల పరామర్శకు భారీ ఏర్పాట్లతో హాజరవుతున్న జగన్మోహన్ రెడ్డి గుంటూరులో తన వాహనం కింద పడి మరణించిన సింగయ్య కుటుంబాన్ని పరామర్శించకపోవడం అన్యాయమన్నారు. చనిపోయిన సింగయ్య వైసీపీ కార్యకర్తని.. వేరే పార్టీలకు సింగయ్య మరణంతో సంబంధం ఏముందని ప్రశ్నించడం ఇంకా ఘోరమని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యలు పరిష్కరించే ప్రజా వేదికను కూల్చిన జగన్మోహన్ రెడ్డి.. వైసీపీ అధికారంలోకి రావడానికి కష్టపడిన సోదరి షర్మిలను ఆస్తి కోసం దూరం పెట్టారని, ఆ పార్టీ గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న తల్లి విజయమ్మను అత్యంత అవమానకరమైన రీతిలో పదవి నుంచి దించేశారన్నారు.

**వైసీపీ హయంలో ప్రతిపక్ష నాయకులకు తీవ్ర ఆంక్షలు**

అధికారంలో ఉండగా ప్రతిపక్ష నాయకులకు జగన్మోహన్ రెడ్డి అడుగడుగునా ఆటంకాలు సృష్టించిన సంగతి ప్రజలెవరూ ఇంకా మర్చిపోలేదని గంటా శ్రీనివాసరావు తెలిపారు. వైసీపీ హయంలో చంద్రబాబును తన ఇంటి నుంచి 12 గంటలు బయటకు కదలనివ్వలేదని.. రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న చంద్రబాబును పరామర్శించడానికి వచ్చిన పవన్ కళ్యాణ్‌కు, యువగళం పాదయాత్రలో నారా లోకేష్ పర్యటనలకు అనేక ఆటంకాలు సృష్టించారన్నారు. ఈ దాష్టీకాలన్నీ మర్చిపోయినట్టు నటిస్తూ.. తాను అధికారంలో ఉండగా ఎవరి పర్యటనలు అడ్డుకోలేదని జగన్మోహన్ రెడ్డి చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని ఆయన చెప్పారు. కార్పొరేటర్లు పి.వి.నరసింహం, లొడగల అప్పారావు, కూటమి నాయకులు శాఖారి శ్రీనివాస్, కసిరెడ్డి దామోదరరావు, గంటా నూకరాజు, కాకరపూడి శ్రీకాంత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# సీబీఎస్ఈ 10వ తరగతి బోర్డు పరీక్షలు ఇక నుంచి ఏడాదికి రెండుసార్లు



**న్యూఢిల్లీ:** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. 2026 నుంచి సీబీఎస్ఈ 10వ తరగతి పరీక్షలు ఏడాదిలో రెండుసార్లు నిర్వహించనున్నారు. మొదటి విడత పరీక్షలు ఫిబ్రవరిలో ఉంటాయి. పదో తరగతి విద్యార్థులందరికీ ఇది తప్పనిసరి. రెండో విడత పరీక్షలు మేలో ఉంటాయి. ఇది ఐచ్ఛికం. తమ పెర్‌ఫారమెన్స్ పెంచుకోవాలని ఆశించే విద్యార్థులు ఈ అవకాశం వినియోగించుకోవచ్చు. ఇంటర్నల్ అసెస్‌మెంట్ మాత్రం అకడమిక్ సెషన్‌లో ఒకేసారి ఉంటుంది. సీబీఎస్ఈ ఎగ్జామినేషన్ కంట్రోల్ సంయమ్ భారద్వాజ్ మాట్లాడుతూ, పరీక్షల ఫస్ట్ ఫేజ్ ఫిబ్రవరిలోనూ, రెండో ఫేజ్ మేలోను ఉంటాయని, ఏప్రిల్, జూన్‌లో ఫలితాలు వెలువడతాయని చెప్పారు. ఫస్ట్ ఫేజ్‌కు విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని, రెండో ఫేజ్ ఐచ్ఛికమని చెప్పారు. విద్యార్థులు సైన్స్, మేథమెటిక్స్, సోషల్ సైన్స్, లాంగ్వేజ్‌లలో మూడు సబ్జెక్టులను ఎంచుకుని బెటర్‌మెంట్ కోసం రాసుకోవచ్చని అన్నారు.

**వింటర్ బౌండ్ స్కూళ్లలో..**

చలిఎక్కువగా ఉండే (వింటర్ బౌండ్) స్కూళ్లలోని పదవ తరగతి విద్యార్థులకు ఏదో ఒక ఫేజ్‌లో పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తున్నారు. సీబీఎస్ఈ గత ఫిబ్రవరిలో ఈ పరీక్షలకు సంబంధించిన ముసాయిదా నిబంధనలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచింది.

# ఇక్కడంతా నియంతృత్వం, బంధుప్రీతి




**పాట్నా (బీహార్) :** ఆర్జేడీ (రాష్ట్రీయ జనతాదల్)కు 13వ సారి జాతీయ అధ్యక్షుడిగా లాలూ ప్రసాద్ యాదవ్ ఇవాళ తన నామినేషన్ దాఖలు చేశారు. దీనిపై లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌పిజి)ఎంపీ అరుణ్ భారతి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇది ఆర్జేడీలో నియంతృత్వం, బంధుప్రీతికి ప్రత్యక్ష సాక్ష్యమని ఆయన అన్నారు. ఆర్‌జెడిలోని అంతర్గత ప్రజాస్వామ్యంపై ఆయన మాటల తూటాలు సంధించారు. పార్టీలో నియంతృత్వం, బంధుప్రీతి పాతుకుపోయిందని విమర్శించారు. ఆర్జేడీ నేత తేజశ్వి యాదవ్ అనేక సందర్భాల్లో ఆర్జేడీలో అంతర్గత ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటాడని, ఆర్జేడీలో బంధుప్రీతికి దీనికంటే గొప్ప ఉదాహరణ మరొకటి లేదని ఎంపీ అరుణ్ భారతి అన్నారు. బాబా సాహెబ్ చిత్రాన్ని లాలూ పాదాల దగ్గర ఉంచినప్పుడు, అతని ఆరోగ్యం బాగాలేదని చెప్పుకొచ్చారని, కానీ నామినేషన్ సమయంలో మాత్రం, లాలూ ఆరోగ్యం బాగానే ఉందని భారతి ఎద్దేవా చేశారు. కాగా, అంతకు ముందు, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) నాయకుడు తేజశ్వి యాదవ్ నిన్న తన తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్ పార్టీ జాతీయ అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేసిన తర్వాత 'పేదల దూత' అని అభివర్ణించారు. లాలూ ప్రసాద్ యాదవ్ 13వ సారి అధ్యక్షుడుగా ఉండటం పట్ల పార్టీ కార్యకర్తలు, నాయకులందరూ సంతోషంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. భవిష్యత్తులో తన తండ్రి నాయకత్వంలో పార్టీ విజయాన్ని రుచి చూస్తుందని ఆశిస్తున్నానని యాదవ్ అన్నారు. అంతేకాదు, 'పేదల దూత లాలూజీ నేడు ఆర్జేడీ జాతీయ అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేశారు. ప్రజలలో అపారమైన ఆనందం ఉంది. లాలూ జీ నామినేషన్ పట్ల పార్టీ కార్యకర్తలు, నాయకులు, ఇతరులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఆయన 12 పదవీకాలాలను పూర్తి చేసుకున్నారు. ఇది ఆయన 13వ పదవీకాలం అవుతుంది. మేమందరం సంతోషంగా ఉన్నాము. రాబోయే కాలంలో లాలూ జీ నాయకత్వంలో మనం విజయం రుచి చూస్తామని మేము నమ్ముతున్నాము' అని బీహార్ మాజీ డిప్యూటీ సీఎం అయిన తేజస్వి అన్నారు. ఇలా ఉండగా, ఆర్జేడీ తన జాతీయ మండలి, రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలను నిర్వహిస్తోంది. ఈ సంస్థాగత ఎన్నికలకు జూలై 5న పోలింగ్ జరుగుతుంది. దీంతో లాలూ 13వ సారి పార్టీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. పాత జనతాదళ్‌లో చీలిక తర్వాత 1997లో ఆర్జేడీ పార్టీ ఏర్పడినప్పటి నుండి లాలు ప్రసాద్ యాదవ్ 28 సంవత్సరాలుగా ఆర్జేడీ చీఫ్‌గా ఉన్నారు. అయితే, ఈ ఏడాది ఆ పార్టీకి అత్యంత కీలకం. ఎందుకంటే, ఈ సంవత్సరం బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

# జగన్‌ను బహిష్కరించాలన్న గంటా వ్యాఖ్యలు దారుణం : బింగి హరికిరణ్ రెడ్డి ఫైర్



**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** వాగ్దానాలు నిలబెట్టుకోలేక జగన్‌పై రాజకీయ దాడులు చేస్తున్న కూటమి ప్రభుత్వం అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్ రెడ్డి విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రాజకీయంగా బహిష్కరించాలన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు గంటా శ్రీనివాసరావు మాటలు బాధ్యతారాహిత్యం గలవిగా, అసంబద్ధంగా ఉన్నాయి.అని మంత్రి పదవి రాకపోవడంతో సీఎం చంద్రబాబుని, నారా లోకేష్‌ను మెప్పించేందుకు జగన్‌పై విమర్శలు చేయడం సరికాదు అని జగన్‌పై విమర్శలకు బలమెవిటి జగన్‌ను విమర్శించడం ముమ్మా టికీ తప్పేనని ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేని పరిస్థితిలో డైవర్షన్ పాలిటిక్స్ అంటూ బింగి ఫైరయ్యారు.తల్లికి వందనం పూర్తిగా అమలు కాలేదని, యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వలేదని, నిరుద్యోగ భృతి, మహిళా రక్షణ, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు వంటివి సాధించలేదని ప్రశ్నించడం తప్పా అని నిలదీశారు. ప్రస్తుతం ప్రభుత్వమే నైతికంగా బహిష్కారానికి అర్హం అని చందనోత్సవంలో 7 మంది మరణించినప్పుడు గంటాను అరెస్ట్ చేశారా తిరుపతిలో ఐదుగురు మరణించేసరికి చంద్రబా బును అడిగారా అలహాబాద్ విమాన ప్రమాదంలో రామ్మోహన్ నాయుడును ప్రశ్నించారా అంటూ బింగి హరికిరణ్ రెడ్డి ఎదురు దాడికి దిగారు.ఇలాంటి వైఖరి కేవలం ప్రజల దృష్టిని మళ్లించేం దుకు చేస్తోందని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమై రాజకీయ ప్రత్యర్థులపై బాహాట విమర్శలకు దిగుతుందన్నారు.

# చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడు అరెస్ట్

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** కశింకోట మండలం, కొత్త అచ్చెర్ల గ్రామంలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడు అరెస్ట్, కేసు వివరాలను డిఎస్పీ కార్యాలయము నందు జరిగిన మీడియా సమావేశంలో ఎం.శ్రావణి తెలిపారు. కశింకోట మండలంలోని కొత్త అచ్చెర్ల గ్రామంలో 16-06-2025 తేదీ సాయంత్రం జరిగిన చైన్ స్నాచింగ్ సంఘటనను కశింకోట పోలీస్ వారు త్వరితగతిన ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేయడంలో విజయవంతమైంది. తేదీ 16.06.2025న సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇంటి ముందు గడ్డి కోస్తున్న ఓ మహిళ మెడలో ఉన్న బంగారు తాడును గుర్తించిన ఓ యువకుడు, ఆమెతో రాజాం వెళ్ళే దారి గురించి అడిగినట్టు నటించి, ఆమెతో మాటలు కలిపి, తర్వాత బైక్‌ను ఆన్‌లో ఉంచి ఆ మహిళను కొట్టి, ఆమె మెడలో ఉన్న బంగారం తాడును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కశింకోట ఇన్స్పెక్టర్ ఏ.స్వామి నాయుడు కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించారు. సిఐ స్వామి నాయుడు పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం ఎస్ఐ కె.లక్ష్మణ్ రావు, ఎస్ఐ పి.మనోజ్ కుమార్, కానిస్టేబుళ్లు డీ.గోపి, శ్రీనివాస్, మహేష్, మూర్తి ఆధ్వర్యంలో ు సాంకేతిక ఆధారాలు, సీసీ టీవీ ఫుటేజ్, నిఘా సమాచారంతో నిందితుడిని గుర్తించి పట్టుకున్నారు.

అరెస్టైన నిందితుడు శీలం కార్తీక్ S/o కొండబాబు, వయసు 24 సం., R/o సత్యవరం గ్రామం, పాయకరావుపేట మండలం, అనకాపల్లి జిల్లా. ఇతడు ప్రైవేట్ ఉద్యోగం మానేసి బెట్టింగ్ వ్యసనంతో అప్పుల్లో కూరుకుపోయిన నేపథ్యంలో, డబ్బు కోసం ఈ దొంగతనానికి పాల్పడ్డట్టు విచారణలో ఒప్పుకున్నాడు. దొంగిలించిన బంగారు తాడు అమ్మేందుకు విశాఖపట్నం వెళుతున్న సమయంలో, 25-06-2025 తేదీన బయ్యవరం వద్ద నిఘా ఉంచిన పోలీసు బృందం అతన్ని అరెస్ట్ చేసి, చోరీకి ఉపయోగించిన బైక్ మరియు బంగారు తాడు స్వాధీనం చేసుకుంది. ఈ కేసును అతి తక్కువ సమయంలో ఛేదించిన కశింకోట పోలీస్ బృందాన్ని అనకాపల్లి డిఎస్పీ అభినందించారు.

ప్రజలందరికీ విజ్ఞప్తి:

అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని డిఎస్పీ శ్రావణి ఈ సందర్భంగా తెలిపారు.

# సిట్ విచారణకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గైర్హాజరు




**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఏపీ మద్యం కుంభకోణం కేసులో సిట్ అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఇప్పటికే ఈ కేసులో తొమ్మిది మందిని అరెస్ట్ చేసి.. వారిని విచారిస్తున్నారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి మాజీ మంత్రి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. లిక్కర్ స్కామ్ కేసులో బుధవారం సిట్ ఎదుట విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే సిట్ విచారణకు మోహిత్ రెడ్డి గైర్హాజరయ్యారు. విచారణకు హాజరు కావటానికి మూడు రోజుల సమయం కావాలని కోరారు. ఈ కేసులో ఆయన ఏ-39గా ఉన్నారు. కాగా ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఇప్పటికే ఏసీబీ కోర్టులో మోహిత్ రెడ్డి పిటిషన్ వేశారు. ఈరోజు ఈ పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ చేయనుంది.

**ఈ కేసులో తండ్రీ కొడుకుల పాత్ర...**

మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, మాజీ మంత్రి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, అతని బినామీగా చెప్పుకుంటున్న వెంకటేశ్ నాయుడును సిట్ అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో వారి పాత్ర ఉన్నట్లు రిమాండ్ రిపోర్టులో అధికారులు నిర్ధారిస్తూ కోర్టుకు నివేదికను సమర్పించారు. చెవిరెడ్డిని అరెస్ట్ చేసిన సమయంలోనే అతడి కుమారుడు మోహిత్ రెడ్డిని కూడా ఏ39గా ఇందులో చేర్చారు. మద్యం కుంభకోణం కేసులో తండ్రీ కొడుకుల పాత్ర ఉన్నట్లు నిర్ధారించారు. అయితే ముందస్తు బెయిల్ కోసం గత శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పిటిషన్ వేశారు.

**డబ్బులు ఏ విధంగా చేరాయి..**

ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా మోహిత్ రెడ్డిని విచారణకు రావాల్సిందిగా సిట్ అధికారులు నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో ఏ1గా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ద్వారానే మొత్తం మద్యం కుంభకోణం వ్యవహారం నడిచిందని ఇప్పటికే సిట్ అధికారులు ఆధారాలు సేకరించారు. అయితే గత ఎన్నికల్లో వైసీపీ ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థిగా మోహిత్ రెడ్డి పోటీ చేసిన నేపథ్యంలో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ద్వారా డబ్బులను తీసుకున్నారని, అందులో చెవిరెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు నిర్ధారించారు. దాదాపు రూ. 250 కోట్లను మధ్యవర్తుల ద్వారా జిల్లాల్లో పోటీ చేసిన ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులకు పంపిణీ చేస్తున్నట్లు సెట్ అధికారులు ఆధారాలు సేకరించారు. మోహిత్ రెడ్డికి కూడా డబ్బులు చేరినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో డబ్బులు ఏ విధంగా చేరాయి.. ఎవరి ద్వారా డబ్బులు వచ్చాయి.. ఏ విధంగా పంపిణీ చేశారనే విషయాలపై మోహిత్ రెడ్డిని విచారించాలని సిట్ భావిస్తోంది. దీంతో మోహిత్ రెడ్డి నుంచి సమాచారం రాబట్టేందుకు అధికారులు నోటీసులు జారీ చేశారు.

# నర్సీపట్నం ప్రధాన కూడళ్లలో సోలార్ లైట్లు



**నర్సీపట్నం, (రాజధాని వార్తలు):** స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ఆదేశాలతో నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ముఖ్య కూడళ్లలో సోలార్ లైట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు సోలార్ లైట్లు కరెంట్ లేదన్న పరిస్థితుల్లో కూడా వెలుగునిస్తాయని, ప్రజలకు రాత్రి సమయంలో భద్రత కల్పించేందుకు వీటిని అమర్చనున్నారు. ఈ క్రమంలో అబీద్ సెంటర్, శ్రీ కన్య సెంటర్, బొడ్డేపల్లి, ఐదు రోడ్ల జంక్షన్, ప్రభుత్వ ఆసుపత్రి, పోలీస్ స్టేషన్, బలిఘట్టం తదితర అవసరమైన ప్రాంతాల్లో మరియు పరిసర ప్రాంతా ల్లో మొత్తం సుమారు 50 సోలార్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు బుధవారం స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఏఈ రవి ఆధ్వర్యంలో ఫిలిప్స్ కంపెనీకి చెందిన 4000 లూమెన్స్ సామర్థ్యం గల 25 వాట్ల సోలార్ లైట్ల నమూనాను స్పీకర్ అయ్యన్న పాత్రుడు పరిశీలించారు. ప్రభుత్వ విభాగాల సమ న్వయంతో ఈ పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని స్పీకర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

# 'షోలే' మూవీకి అత్యధిక పారితోషికం ఎవరిదో తెలుసా?



బాలీవుడ్ బిగ్‌బి సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్, ధర్మేంద్రల కాంఇబనేషన్‌లో రూపొందిన సంచలన మల్టీస్టారర్ షోలే. ఇండియన్ సినీ చరిత్రలో ఎన్నో రికార్డుల్ని తిరగరాసిన ఈ సినిమా తరువాత ఆ స్థాయి మల్టీస్టార్ మూవీ ఇంత వరకు రాలేదు. జీపి సిప్పి నిర్మించగా ఆయన తనయుడు రమేష్ సిప్పి ఈ మూవీని డైరెక్ట్ చేశారు. ఆగస్టు 15, 1975లో విడుదలైన ఈ సినిమాలో హేమా హేమీలు జయా బచ్చన్, హేమామాలిని, అమ్జాద్ ఖాన్, సంజీవ్‌కుమార్ కీలక పాత్రల్లో నటించారు. ఇందులో ధర్మేంద్ర మెయిన్ హీరో. అమితాబ్ బచ్చన్ సెకండ్ లీడ్. కానీ సినిమా రిలీజ్ తరువాత మాత్రం ఎక్కువ క్రేజ్ అమితాబ్ బచ్చన్‌కు దక్కింది. ఆర్‌డీ బర్మన్ సంగీతం అందించిన ఈ సినిమా ఇప్పటికీ ఇండియన్ సినీ చరిత్రలో ఎవర్ గ్రీన్ బ్లాక్ బస్టర్ క్లాసిక్‌గా నిలిచింది. ఈ సినిమా విడుదలై 50 ఏళ్లు కావస్తున్నా ఇప్పటికీ దీనిపై ఎక్కడో ఒక దగ్గర చర్చ జరుగుతూనే ఉంది. అంతా ఈ సినిమా భారతీయ సినీ ప్రేక్షకులపై బలమైన ముద్ర వేసింది. ఇప్పటికీ ఎక్కడో ఒక చోట ఆడుతూ ఇప్పటి వరకు 25 కోట్ల టికెట్‌లు తెగిన ఏకైక సినిమాగా రికార్డు సాధించింది. భారతీయ సినీ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించిన ఈ సినిమా మరో సారి 4కెలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. జూన్ 27 రిలీజ్ కాబోతోంది. ఇదే రోజు ఇటలీలోని బొలోగ్నాలోని ద ఫేమస్ సినిమా రెట్రోవెటో ఫెస్టివెల్‌లో దీన్ని ప్రదర్శించబోతున్నారు. అంతేకాకుండా అన్ కట్ వెర్షన్‌ని ఇక్కడ ప్రదర్శిస్తారని తెలిసింది.


ఇక ఈ సినిమాకు ఆర్టిస్ట్‌లు అందుకున్న పారితోషికాల వివరాలు షాక్‌కు గురి చేస్తున్నాయి. అయితే ఇందులో ధర్మేంద్రదే అత్యధిక పారితోషికం కావడం విశేషం. షోలో మొత్తం బడ్జెట్ రూ.3 కోట్లు. ధర్మేంద్ర పారితోషికం రూ.1.50 వేలు. సంజీవ్ కుమార్ రూ.1.25 వేలు, అమితాబ్ బచ్చన్‌కు ఇచ్చింది కేవలం లక్ష మాత్రమే. ఇక హేమా మాలినికి రూ.75,00 వేలు, అమ్జాద్ ఖాన్‌కు రూ.50,00 వేలు, జయా బచ్చన్‌కు రూ.35,000 మాత్రమే.

# చిన్నాని రంగంలోకి దించుతోన్న నయా స్టార్!



విశ్వ నటుడు కమల్ హాసన్ ఇటీవలే థగ్ లైఫ్‌తో ప్రేక్షకుల ముందుకొచ్చి భంగపడ్డారు. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన సినిమా తీవ్ర విమర్శ పాలైంది. చివరకు దర్శకుడు మణిరత్నం దిగొచ్చి క్షమాపణలు కూడా చెప్పాల్సి వచ్చింది. ఇదంతా గతం. మరి ఇప్పుడు కమల్ ఏం చేస్తున్నట్లు? అంటే స్టంట్ మాస్టర్ అన్బు- అరీవు దర్శకత్వంలో ఓ సినిమాకు రెడీ అవుతున్నారు. ఈ యాక్షన్ చిత్రం త్వరలోనే పట్టా లెక్కనుంది. ఈలోగా కమల్ మరో డైరెక్టర్ని కూడా లైన్‌లో పెడుతున్నారు. అరుణ్ కుమార్ అనే డైరెక్టర్‌ని తెరపైకి తెస్తున్నారు. ఇటీవలే ఇద్దరి మధ్య స్టోరీ డిస్కషన్ జరగగా నచ్చడంతో కమల్ ఒకే చేసారట. దీంతో ఈ చిత్రాన్ని కూడా కమల్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్స్ పైనే నిర్మించాలనుకుంటున్నారట. ఇది భారీ స్పాన్ ఉన్న చిత్రమని కమల్ భావిస్తున్నారట. ఇతర భాషల నుంచి కూడా నటీనటుల్ని తీసుకోవాలనుకుంటున్నారట. దీనికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. అరుణ్ కుమార్ విషయానికి వస్తే 'పన్నియారమ్ పన్నియమ్' చిత్రంతో దర్శకుడిగా పరిచయ్యాడు. ఇందొక ఫ్యామిలీ కామెడీ డ్రామా. ఇందులో విజయ్ సేతుపతి హీరోగా నటించాడు. అటుపై విజయ్ సేతుపతితోనే 'సేతుపతి' టైటిల్ తో ఓ పోలీస్ స్టోరీ తెరకెక్కించాడు. ఇది మంచి విజయం సాధించింది. తన మూడవ చిత్రాన్ని కూడా విజయ్ తోనే చేసాడు. ఆ తర్వాత సిద్దార్ధ్‌తో 'చిన్నా' తెరకెక్కించాడు. ఈ సినిమాతో అతడికి ప్రత్యేకమైన గుర్తింపు దక్కింది. తమిళ్, తెలుగులో ఈ సినిమా మంచి విజయాన్ని సాధించింది. అలాగే చియాన్ విక్రమ్‌తో 'వీర ధీర శూరన్ 2' తెరకెక్కించాడు. ఈసినిమా కూడా బాగానే ఆడింది. ఈ నేపథ్యంలో కమల్ హాసన్ కూడా విక్రమ్‌తో పనిచేయడానికి ముందుకొస్తున్నట్లు తెలుస్తోంది.

# పంచాయత్ 4 ఎలా ఉంది..?



ప్రైమ్ వీడియోలో వచ్చే వెబ్ సీరీస్ లకు సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. ఆ సీరీస్‌ల ఫ్రాంచైజీలు ఎప్పుడొస్తాయా అన్న విధంగా ఆడియన్స్‌ని ఎంగేజ్ చేస్తూ వచ్చాయి. అలాంటి సీరీస్‌లో ఒకటి పంచాయత్ ఒకటి. 2020లో మొదటి సీజన్ రాగా అది ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. రాజకీయ నేపథ్యంతో ఫన్ అండ్ ఎంటర్టైనర్‌గా ఈ సీరీస్ సాగుతుంది. పంచాయత్ సీజన్ 1 సూపర్ సక్సెస్ అవ్వడంతో ఆ తర్వాత మరో రెండు సీజన్లు తెరకెక్కించారు. ఇక లేటెస్ట్‌గా పంచాయత్ సీజన్ 4ని ప్రైం ఆడియన్స్ కోసం తీసుకొచ్చారు. దీపక్ కుమార్ మిశ్రా డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ వెబ్ సీరీస్‌లో జితేంద్ర కుమార్, రఘుబీర్ యాదవ్, ఫైసల్ మాలిక్, నీనా గుప్తా లీడ్ రోల్‌లో నటించారు. ఈ సీరీస్‌కు చందన్ కుమార్ స్క్రీన్ రైటర్‌గా పనిచేశారు. పంచాయత్ సీజన్ 4 మొత్తం 8 ఎపిసోడ్‌తో 5 గంటల రన్ టైంతో వచ్చింది. ఇంతకీ పంచాయత్ సీజన్ 4 కథ ఏంటంటే.. పులేరా విలేజ్‌లో అభిషేక్ త్రిపాఠి (జితేంద్ర కుమార్) CAT పరీక్షలకు సిద్ధం అవుతాడు. ఐతే మరోపక్క ఒక యాక్సిడెంట్ నుంచి తప్పించుకున్న ప్రధాన్ జీ బ్రిజ్ భూషణ్ (రఘుబీర్ యాదవ్) ఎమ్మెల్యే చందు సింగ్ (పంకజ్ ఝా) ఇంజ్కా భూషణ్ (దుర్గేష్ కుమార్)పై కేసు పెడతాడు. అభిషేక్ భూషణ్ సంధి కుదర్చాలని అనుకోగా భూషణ్ తనకు క్షమాపణ చెప్పాలని చూసిన అభిషేక్ కి ఒక పనిచెబుతాడు. ఈ క్రమంలో భూషణ్, ప్రధాన్ జీల మధ్య ఎలాంటి రాజకీయ శత్రుత్వం ఏర్పడింది.. ఈ పరిణామాలు ఎక్కడికి దారి తీశాయి అన్నది పంచాయత్ 4 కథ. విలేజ్ బ్యాక్ డ్రాప్‌తో వచ్చిన ఈ వెబ్ సీరీస్‌లో మెయిన్ లీడ్ అయిన జితేంద్ర ఇంప్రెస్ చేశారు. ముందు వచ్చిన సీజన్లు ఎంటర్టైనింగ్ విషయంలో ఆడియన్స్‌ని డిజప్పాయింట్ చేయలేదు. సీరీస్‌లో లడ్డూ గొడవ, భోజనాల దగ్గర అల్లరి ఇలా కొన్ని బలంగా ఉన్నా సీజన్ మొత్తం చూస్తే మాత్రం కాస్త నిరుత్సాహపరిచిందని అనిపిస్తుంది. ముఖ్యంగా ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో ఈ సీజన్ అంతగా ఇంప్రెస్ చేయలేదు. కామెడీతో ప్రేక్షకులను మెప్పించాలని అనుకున్నా పొలిటికల్ బ్యాక్ డ్రాప్ సీన్స్ అసలు వర్క్ అవుట్ అవ్వలేదు. ఇక కథనం కూడా స్లో అవ్వడం వల్ల సాగదీసిన ఫీలింగ్ వస్తుంది. ఎలాంటి ట్విస్టులు లేకుండా చేయడం వల్ల ఆడియన్స్‌కి బోర్ కొట్టేస్తుంది. పంచాయత్ మునుపటి సీజన్లలో ఉన్న కామెడీ ఎంటర్టైన్మెంట్ ఇందులో లోపించిందనిపిస్తుంది. 8 ఎపిసోడ్స్‌తో 5 గంటల రన్ టైంతో వచ్చిన పంచాయత్ 4 సీరీస్ ముగింపుని కూడా సరిగా లేదని చెప్పొచ్చు. టెక్నికల్‌గా ఓకే అనేలా అనిపించిన సీరీస్ బలమైన కథ ఉన్నా దాన్ని మెప్పించేలా నడిపించలేకపోయారని చెప్పొచ్చు. పంచాయత్ 4 సీజన్ పై అంచనాలు బాగున్నాయి. ఐతే ఇదివరకు సీజన్లతో పోలిస్తే కామెడీ ఇంకా కథనం మైనస్ అనిపిస్తాయి.

# మహేష్ బాబు అనగనగా ఏమన్నాడంటే..!



సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో సినిమాను చేస్తున్నాడు. ఈ సినిమా కోసం ఫ్యాన్స్‌తో పాటు పాన్ ఇండియా ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రాజమౌళి సినిమా అంటేనే చాలా ఆలస్యం అవుతుంది. మహేష్ బాబు సినిమా కోసం ఏకంగా ఏడాది పాటు స్క్రిప్ట్ వర్క్ చేసిన రాజమౌళి, ప్రీ ప్రొడక్షన్ వర్క్ కోసం మరికొన్నాళ్లు తీసుకున్నాడు. ఎట్టకేలకు షూటింగ్ ప్రారంభించిన రాజమౌళి బ్యాక్ టు బ్యాక్ షెడ్యూల్స్‌ను చేస్తున్నాడు. గత నెలలో సమ్మర్ హాలీడేస్‌ను తీసుకున్న విషయం తెల్సిందే. తిరిగి షూటింగ్ ప్రారంభంకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రియాంక చోప్రా కూడా హైదరాబాద్ వచ్చింది. దాంతో మహేష్ బాబు, ప్రియాంక చోప్రా కాంబోలో సన్నివేశాలతో పాటు, పాట చిత్రీకరణ ఉండే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మహేష్ బాబు తనకు నచ్చిన సినిమాల గురించి, తన సన్నిహితుల సినిమాల గురించి అప్పుడప్పుడు సోషల్ మీడియా ద్వారా స్పందించడం మనం చూస్తూనే ఉంటాం. కేవలం తెలుగు సినిమాలకు మాత్రమే కాకుండా ఇతర భాషల సినిమాలకు కూడా తన రివ్యూను ఇస్తూ ఉంటాడు. ఇటీవల బాలీవుడ్ మెగాస్టార్ ఆమీర్ ఖాన్ నటించిన సితారే జమీన్ పర్ సినిమాను ప్రశంసిస్తూ ట్వీట్ చేశాడు. మంచి కాన్సెప్ట్‌తో వచ్చిన సినిమా అంటూ అభినందించాడు. అంతే కాకుండా అంతా చూడాల్సిన సినిమా అని కూడా చెప్పుకొచ్చాడు. ఇలాంటి కాన్సెప్ట్‌లతో సినిమాను చేయడం అనేది గొప్ప విషయం అన్నట్లుగా చెప్పుకొచ్చిన మహేష్ బాబు తాజాగా తెలుగు సినిమాకు రివ్యూ ఇచ్చాడు. చాలా రోజుల క్రితం విడుదల అయిన 'అనగనగా..' సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈటీవీ విన్ ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాను థియేట్రికల్ రిలీజ్ చేయాలని కూడా చాలా మంది అన్నారు. ఇలాంటి సినిమాలను ఓటీటీ ద్వారా కంటే థియేట్రికల్ రిలీజ్ చేసి ఉంటే బాగుండేదనే అభిప్రాయం చేసిన వారు చాలా మంది ఉన్నారు.

అందుకే లిమిటెడ్ థియేటర్‌లలో ఓటీటీ స్ట్రీమింగ్ తర్వాత రిలీజ్ చేసిన విషయం తెల్సిందే. జనాలు ఈ సినిమా గురించి మరచి పోతున్న సమయంలో మహేష్ బాబు ఈ సినిమా గురించి స్పందించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిం చారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా మహేష్ బాబు స్పందిస్తూ... అనగనగా సినిమా చాలా చక్కగా చెప్పడిని మంచి కథ. భావోద్వేగాలతో కూడిన ఈ సినిమా బాగుంది. మీరు తప్పకుండా సమయం వ్యచ్చించి చూడదగ్గ సినిమా. సుమంత్‌తో పాటు మొత్తం యూనిట్ సభ్యుల ప్రయత్నం అభినందనీయం. వారికి నా అభినందలు తెలియజేస్తున్నాను అంటూ ట్వీట్ చేశాడు. ఈటీవీ విన్‌లో ఈ సినిమాకు మంచి స్పందన దక్కింది. అత్యధిక వ్యూస్‌ను సొంతం చేసుకున్న సినిమాగా నిలిచింది. సినిమాకు ఇప్పుడు మహేష్ బాబు రివ్యూ ఇవ్వడంతో కచ్చితంగా సినిమా కు మరోసారి ఈటీవీ విన్‌లో మంచి స్పందన దక్కడం ఖాయం అని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఒక వరంలాంటిది : ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)

### - 30 మంది లబ్ధిదారులకు రూ.24 లక్షల 28 వేలు చెక్కుల అందజేత






**విజయవాడ, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలోని పేద ప్రజలకు ముఖ్య మంత్రి సహాయ నిధి ఒక వరం లాంటిది. అనారోగ్యం బారిన పడి వైద్య చికిత్సలు చేయించుకున్న బాధితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో తక్షణం అందిస్తున్న సీఎంఆర్ఎఫ్ (సీఎం రిలీ ఫ్ ఫండ్) చేయూతగా నిలుస్తుందని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవా రం సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.24 లక్షల 28 వేల రూపాయాల విలువ గల చెక్కులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పంపిన లేఖను లబ్ధిదారులకు ఎంపి కేశినేని శివనాథ్ అందజేయటంతో పాటు లబ్ధిదారులందరితో ఎంపీ కేశినేని శివనాథ్ ప్రత్యేకంగా మాట్లాడారు. విజయవాడకి చెందిన యర్రం శెట్టి వెంకటేశ్వరరావుకి క్యాన్సర్ వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన రూ.8 లక్షలు, వేమారెడ్డి రామిరెడ్డి రూ.2 లక్షల 50 వేలు, కె.లక్ష్మమ్మ రూ.ఒక లక్ష ఇరవై వేలు, కె.వరలక్ష్మీ రూ.60 వేలు విలువ గల ఎల్.వో.సి పత్రాలను అందజేయగా, గద్దె అప్పాయ్య కు రూ.35 వేలు, అల్లా నాగమల్లేశ్వరరావుకి రూ.44,924 , పి.అచ్చుమ్మకి 46,741, పి.రమణమ్మ కి 51,795, వాడపల్లి సత్యం కు రూ.68,795, జి.సాయి పూజిత రూ.40,820, సయ్యద్ బహుదర్ రూ.47, 642, కె.అంజనరావు రూ.23,400, కె.రామస్వామి రూ.49, 625, కె.శ్రీదేవి రూ.38,700, షకీలా బేగం రూ.4,21,593, షేక్ అబ్దుల్ నబీ రూ.40,350, సామినేని చిట్టెమ్మ రూ.37,378, పి.శ్రీనివాసరావు రూ.56,485, తాతా పద్మావతి రూ.27, 493, గద్దె వెంకటేశ్వర రెడ్డి 31,377, షేక్ ఆఫియా అంజూమ్ రూ.30,786, పి.నాగరాజు రూ. 25,000, బి.పొలయ్య రూ.60 వేలు, వల్లభనేని శ్రీలక్ష్మీ రూ. 45,541, ఎమ్.శంకరరావు రూ.61,572, పి.కమలాకర్ రూ.25,166, మహ్మద్ అస్మా రూ.43,786, లక్కిరెడ్డి నాగేంద్రమ్మ రూ.44,048, కె.స్వాతి రూ.70 వేలు, ఆర్.లక్ష్మీ ప్రతిమ రూ.40 వేలు, సి.హెచ్. రామారావు రూ.40 వేలు, కె.సత్యవతి రూ.40,786 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సుపరిపాలనలో రాష్ట్రంలో ప్రజలందరూ సంతోషంగా వున్నార న్నారు. లబ్ధిదారులకు సకాలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందే విధంగా చర్యలు తీసుకున్న సీఎం చంద్రబాబుకి ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బాధితులకు సీఎంఆర్ ఎఫ్ చెక్కులు, ఎల్.వో.సి పత్రాలు అందుతున్నాయన్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాదిలో 145 మందికి దాదాపు కోటి 85 లక్షల రూపాయల చెక్కులు అందజేయటం జరిగందన్నారు. ప్రజ లకు ఏ కష్టం వచ్చినా ఎన్డీయే కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీముల్లా, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎమ్. ఫైజాన్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పరిశపోగు రాజేష్ (దళితరత్న), టిడిపి నాయకులు సంకె విశ్వనాథం లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తంగా ఉండాలి : ఈవిఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్






**నెల్లిమర్ల, (విజయనగరం), (రాజధాని వార్తలు):** మండల పరిధిలోని ఈవి ఎం గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బుధవా రం తనిఖీ చేశారు. గోదాము షట్టర్లకు, లోపలి గదులకు వేసిన సీళ్లను, తాళాలను తీయించి, లోపల ఉన్న ఈవిఎం ట్రంకు బాక్సులను తనిఖీ చేశారు. అనంతరం సీళ్లు వేయించారు. సిసి కెమేరాలను పరిశీలించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లపై సమీక్షిం చారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులను, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. డిఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఇన్‌ఛార్జ్ ఆర్‌డిఓ టి.సవరమ్మ, నెల్లిమర్ల తాహసీల్దార్ శ్రీకాంత్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటిండెంట్ భాస్కరరావు, ఇతర సిబ్బందితోపాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు సోములు, సిహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ తరాల రక్షణలో భాగస్వామ్యం అవ్వండి

### - నషాముక్త భారత్ అభియాన్ ర్యాలీకి ప్రతి ఒక్కరూ హాజరుకండి
### - నేడు జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో నషా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీ

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** జిల్లా కేంద్రం మరియు నియోజ కవర్గ కేంద్రాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీని గురు వారం సాయంత్రం 4.30 గంటల నుండి 5.30 గంటల వరకు పెద్ద ఎత్తున చేపట్టాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నషా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీ కార్యక్రమంపై జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ రావుతో కలిసి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహిం చారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమన్ని ప్రజల్లో విస్తృత అవగాహన కలిగించేలా రూపొందించాలని సూచించారు. వీడియో కాన్ఫిరెన్స్‌లో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓలు, డిఎస్పీలు, సీఐలు, ఎంపీడీ ఓలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమీషనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతోపాటు నియోజ కవర్గాలలో భారీ ఎత్తున నిర్వహించాలని ఆమె ఆదేశించారు. భవిష్యత్ తరాల రక్షణలో భాగస్వామ్యం అవ్వండి – నషాముక్త భారత్ ర్యాలీకి యువత, మహిళలు, విద్యార్థులు, గ్రామ /వార్డు సచివాలయల సిబ్బంది మరియు ఆశా, అంగన్వాడీ వర్కర్లు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. "యువత గంజాయి, డ్రగ్స్, మద్యపానం వంటి దురాచారాల వలలో పడకుండా ఉండే విధంగా వారిలో చైతన్యం కలిగించడమే మన బాధ్యత అని, నేటి తరానికి, రేపటి భవిష్యత్ పౌరులకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన సమాజంను అందించాలంటే, ఈ విధమైన చైతన్య ర్యాలీలు కీలకమైనవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కేవలం అవగాహన కార్యక్రమం కాక, ఒక సామాజిక ఉద్యమంగా మారా లన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ భారీ ర్యాలీని కార్యక్రమం జిల్లా కేంద్రంలో రేపు గురువారం సాయంత్రం 4.30 గంటల నుండి 5.30 గంటల వరకు అనకాపల్లి పట్టణం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుండి పెంటకోట భవనం వరకు ర్యాలీ నిర్వహిం చనున్నట్లు ఆమె తెలిపారు. అదే సమయంలో అన్ని నియోజకవర్గ ప్రధాన పట్టణ కేంద్రల్లో ర్యాలీలు, అవగాహనా సదస్సులు నిర్వ హించాలని అధికారులను ఆదేశించారు. ఒకవేళ నియోజకవర్గ ప్రధాన పట్టణ కేంద్రాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నారని వివరించారు. నియోజకవర్గ పట్టణ కేంద్ర ల్లో జరిగే ర్యాలీలో పాల్గొనకపోతే మండల కేంద్రాల్లో జరిగే ర్యాలీలు అవగాహన సదస్సులో పాఠశాలలు, కళాశాలల, ఇంజ నీరింగ్ కళాశాల విద్యార్థులు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలాని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలను రౌండ్ టేబుల్ చర్చలు, ప్రచార ర్యాలీలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు, మైమ్స్ వంటివి ఉపయోగించి చైతన్యవంతంగా మలచాలని సూచించారు. ప్రతి అధికారి తమ పరిధిలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వ హించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలసి ర్యాలీలో పాల్గొని "నషాముక్త భారత్ అభియాన్" లక్ష్యాన్ని సాకారం చేయడంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ మరియు ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓ లు షేక్ అయిషా, వీ వీ రమణ, డి ఎస్పీ లు, సీ ఐ లు, ఎంపీడీఓ లు, తహసీల్దార్లు, మునిసిపల్ కమీషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న రామునాయుడుని పరామర్శించిన సిరి సహస్ర (సిరమ్మ)






**భీమిలి నియోజకవర్గం, (రాజధాని వార్తలు):** పద్మనాభం వైస్సార్సీపీ మం డల పార్టీ అధ్యక్షులు కుటుంబాన్ని పరామర్శించిన భీమిలి నియో జకవర్గం సమన్వయకర్త చిన్న శ్రీను అల్లుడు ప్రదీప్ నాయుడు, కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర (సిరమ్మ) ఈరోజు ఇటీవల ప్రమాదానికి గురై విశాఖపట్నం మెడికవర్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న పద్మనాభం వైఎస్ఆర్సిపి మండల పార్టీ ప్రెసిడెంట్ కోరాడ లక్ష్మణ్ సోదరుడు కోరాడ రాము నాయుడుని గౌరవ విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్ ఆర్సిపి జిల్లా పార్టీ అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అల్లుడు ప్రదీప్ నాయుడు, కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర (సిరమ్మ) మెడికవర్ హాస్పిటల్‌కి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కోరాడ రామునాయుడు ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని మనోధార్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు మరియు ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ అవార్డు సాధించాలి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్



**విజయనగరం, (రాజధాని వార్తలు):** గ్రామీణ స్థాయిలో పరిశుభ్రతకు అందించనున్న స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్– 2025 అవార్డుకు ప్రతి మండలం నుండి రెండు గ్రామ పంచాయతీలు పోటీపడే విధంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2025 కు గ్రామపంచాయతీలను ఎంపిక చేయుటకు గాను ర్యాంకింగ్ అందజేయుటకు కేంద్ర బృందం వస్తున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో వెబెక్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 37 పంచాయతీలను మోడల్ పంచాయతీలుగా తీర్చిదిద్దడం జరిగిందని, ఆ గ్రామాల్లో పారిశుధ్యం, ప్లాస్టిక్ మేనేజ్మెంట్, ఓడిఎఫ్, వేస్ట్ మేనేజ్మెంట్ తదితర అంశాలు సంబంధించిన పనితీరును పరిశీలించి స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2025 ర్యాంకింగ్ ఇచ్చుటకు జిల్లాలో కేంద్ర బృందం పర్యటించనునట్లు తెలిపారు. బృందం పర్యటనకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేయాలని, అధికా రులు సిబ్బంది సమన్వయం చేసుకొని పనిచేయాలని తెలిపారు. పారిశుద్ధ్య, పరిశుభ్రత ప్రమాణాలకు సంబంధించి ప్రతి మోడల్ పంచాయతీ నిర్దేశించిన వేయి మార్కులు సాధించుటకు కృషి చేయాలని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2025 అవార్డుకు ఎంపిక అగుటకు నిర్దేశించిన పారామితులను చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమా వేశంలో జిల్లా పరిషత్ సీఈవో సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్.ఇ.కవిత, మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డిడబ్ల్యూఎస్‌సి సిబ్బంది సుధాకర్, శ్రీలక్ష్మి, సంధ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** పౌర సరఫరాల శాఖ కమిషనర్, విజయవాడ ఆదేశాల మేరకు, అనకాపల్లి జిల్లాలో 65 సంవత్స రాల పైబడిన ఒంటరి/కుటుంబ వృద్ధులు, మంచానికి పరిమిత మైన వృద్ధులు, అలాగే దివ్యాంగ రైస్ కార్డు దారులకు జూలై నెల రేషన్ ముందస్తుగా వారి నివాసాలకు తక్షణ పంపిణీ చేయను న్నారు. ఈ పంపిణీ జూన్ 26 నుండి 30వ తేదీ వరకు జరు గుతుంది. ప్రతి చౌకధరల దుకాణాన్ని ఆయా గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందితో అనుసంధానించి ముందుగానే తగిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. రేషన్ డీలర్లు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయనున్నారు. అదే సమయంలో, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని చౌకధరల దుకాణాలకు జూలై కోటా రేషన్ నిల్వలు మండల నిల్వల కేంద్రాల (%మీూా%) ద్వారా పంపిణీ పూర్తయి నదిగా తెలియజేయబడింది. కావున పై కేటగిరీలోకి వచ్చే రైస్ కార్డుదారులు తమ ఇళ్లలోనే ఉండి, రేషన్ వస్తువులు పొందగల రని, చౌకధరల దుకాణాలకు వచ్చే అవసరం లేదని తెలియ జేయడమైనది. ఇందుకు సంబంధించి రేషన్ డీలర్ల సంఘం నాయకులకు ముందుగానే సమాచారమివ్వబడి, తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించబడినది.

# యాంటీ డ్రగ్స్‌పై అవగాహన సదస్సు

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఈనెల 26 మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం ప్రతి నియోజకవర్గంలో స్థానిక శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో విధిగా నియోజకవర్గ ప్రజలు, నాయకుల ద్వారా యాంటీ డ్రగ్స్‌పై ఎలమంచిలి డిగ్రీ కాలేజ్ గ్రౌండ్ ప్రాంగణంలో అవగాహన సమావేశం, అనంతరం ర్యాలీ జరుగును కావున పార్టీలకతీతంగా ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, స్థాని కులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమం జయప్ర దం చేయాలని కోరుచున్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan